# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి
- ప్రజావాణికి 50 ఫిర్యాదులు

ఆదిబట్ల, డిసెంబర్ 30 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి వచ్చిన సమస్యలను విన్నవిస్తూ కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.

**ప్రజావాణిలో 50 ఫిర్యాదులు...**

ప్రజావాణిలో ప్రజల నుంచి 50 ఫిర్యాదులు వచ్చాయని జిల్లా అధికారులు తెలిపారు. రెవెన్యూ శాఖ-31, పీడీ హౌసింగ్-10, డీపీవో-2, మున్సిపల్-2, ల్యాండ్ ప్రొటెక్షన్-2, విద్యుత్తు-1, ఎండోమెంట్-2 తో కలిపి 50 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిని ఆయా శాఖల అధికారులకు పంపించి పరిష్కరించేలా కృషి చేస్తున్నామన్నారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఆదిబట్ల : ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

**వికారాబాద్‌లో 79 ఫిర్యాదులు**

**వికారాబాద్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి కలెక్టర్.. అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డీవో వాసూచంద్రతో కలిసి స్వీకరించారు. మొత్తం 79 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో భూసమస్యలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం వివిధ శాఖలకు చెందిన అర్జీలను ఆయా శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ఇతర అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్ : ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## బీఈ పరీక్ష ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30: ఓయూ పరిధిలోని అన్ని బీఈ కోర్సుల పరీక్షల ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్‌సీబీసీఎస్) కోర్సుల మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లమెంటరీ పరీక్ష ఫీజును వచ్చే నెల 3వ తేదీ లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

## వాయిదా పడిన పరీక్షల తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 30: ఓయూ పరిధిలో వాయిదా పడిన వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి చెందిన నేపథ్యంలో ఈనెల 27న రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఆ రోజు జరగాల్సిన అన్ని పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. బీఏ, బీబీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షను వచ్చే నెల 2న, ఎంబీఏ వన్‌టైం చాన్స్ పరీక్షను వచ్చే నెల 3న, మాస్టర్స్ డిగ్రీ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) పరీక్షను తిరిగి వచ్చే నెల 6న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా సమ యం, పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవాలని తెలిపారు.

## బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవు



సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

వికారాబాద్, డిసెంబర్ 30 : బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని అదనపు ఎస్పీ హనుమంత రావు హెచ్చరించారు. సోమవారం డీపీవో వికారాబాద్ సమావేశ మందిరంలో జనవరిలో నిర్వహించే ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమంలో భాగంగా అనుబంధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో బాల్యం లేకుంటే ఎంతో కోల్పోయిన వారవుతారన్నారు. జిల్లాలో జనవరి ఒకటో తేదీ నుంచి 31 వరకు అధికారులు, పోలీసు, లేబర్, స్వచ్ఛంద సంస్థలు, పిల్లల సంక్షేమ కమిటీ, చైల్డ్ లైన్ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి బాల కార్మికులు లేకుండా కృషి చేయాలన్నారు. సమావేశంలో పిల్లల సంక్షేమ కమిటీ చైర్మన్ వెంకటేశ్, పోలీస్ ఇన్‌స్పెక్టర్లు ఆంజనేయులు, అన్వర్ పాషా, బీఆర్‌బీ కోఆర్డినేటర్ కాంతారావు, డబ్ల్యూసీడీ సభ్యులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు, ఏహెచ్‌టీయూ టీం సభ్యులు, లేబర్ డిపార్ట్‌మెంట్ సభ్యులు, ఆపరేషన్ స్మైల్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుంది



ధ్యాన మహాయాగం సభలో మాట్లాడుతున్న పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి

- పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ
- కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం మహాసభలు
- తరలివచ్చిన పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు

కడ్తాల్, డిసెంబర్ 30 : నిత్య ధ్యాన సాధనతోపాటు పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-3 మహా సభలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంజయ్‌కింగీ-గణేశ్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన, ప్రాతఃకాల సంగీత ధ్యానంలో వివిధ ప్రాంతాలకు చెందిన పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి పరిణతి పత్రీ మాట్లాడుతూ.. ధ్యాన సాధనతో బుద్ధి పెంపొంది అన్ని విషయాలను సులువుగా అర్థం చేసుకుంటామని పేర్కొన్నారు. పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగాలు అద్భుతంగా కొనసాగుతున్నాయని, సహరిస్తున్న ప్రతి ధ్యాని కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. అనంతరం ధ్యాన గురువులు రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలను పరిణతి పత్రీతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సాయంత్రం ప్రధాన వేదికపై కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మీడియా కో-ఆర్డినేటర్ భాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, శ్రీరాంగోపాల్, దామోదర్‌రెడ్డి, మధుమోహన్, హనుమంతురావు, రాంబాబు, చంద్రశేఖర్, హనుమంతురాజు, బాలకృష్ణ, శివప్రసాద్, లక్ష్మి, మాధవి, నిర్మల, రాజేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ః ఆకట్టుకున్న కళాకారుల నృత్య పదర్శన

# పాల తయారీ కేంద్రంపై దాడి

- అపరిశుభ్ర వాతావరణంపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆగ్రహం
- నెయ్యి, పాల క్రీమ్ సీజ్.. కాస్టిక్ సోడా ధ్వంసం

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 30 : రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల తయారీ కేంద్రంలో దాడులు నిర్వహించారు. సోమవారం టాస్క్‌ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, జగన్నాథ్, శివశంకర్‌రెడ్డితో కూడిన బృందం మున్సిపాలిటీ పరిధిలోని పసుమాములలోని ఆల్ రిచ్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ (శ్వేత బ్రాండ్ పాలు, పెరుగు ఉత్పత్తి కేంద్రం)లో తనిఖీలు చేపట్టింది. పాలు, పాల పదార్థాలను హానికరమైన రసాయనాలతోపాటు ఒకే రిఫ్రిజిరేటర్‌లో పెట్టడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాన్, జర్దాలు ఉమ్మిన చోటనే పాల డబ్బాల మూతలు పెట్టడంపై మండిపడ్డారు. లైసెన్సు విషయంలో అస్పష్టత ఉన్నట్టు పేర్కొన్నారు. పలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)లోని పలు సెక్షన్ల కింద నోటీసులు జారీ చేశారు. లేబుల్, ఇతర వివరాలు లేకుండా విక్రయించేందుకు సిద్ధంగా డెయిరీలో ఉన్న నెయ్యి ఫ్లేవర్ పాలు, మరి కొన్ని ఇతర రకాల పాలను, రూ.1.68 లక్షల విలువైన 280 కిలోల నెయ్యి ప్యాకెంట్లు, పాల నుంచి తీసిన 350 కిలోల క్రీమ్‌ను సీజ్ చేశారు. 850 కిలోల హానికరమైన కాస్టిక్ సోడాను స్వాధీనం చేసుకున్నారు. ఈ హానికరమైన సోడాను పాల తయారీలో ఉపయోగిస్తున్నట్టు గుర్తించి ధ్వంసం చేశారు. పలు శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపామని, కల్తీ అని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టాస్క్ ఫోర్స్ టీం హెడ్ జ్యోతిర్మయి స్పష్టంచేశారు. నిబంధనలు పాటించనివారిపై కేసులు నమోదుచేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.



సీజ్ చేసిన వస్తువులతో ఫుడ్ సేఫ్టీ అధికారులు

# బల్దియాకు భూసేకరణ గండం

**ఆస్తుల స్వాధీనంపై స్పష్టత లేకుండానే హెచ్ సిటీ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన**



కేబీఆర్ చుట్టూ ఫ్లై ఓవర్లు,అండర్‌పాస్‌లు.. సవాల్‌గా మారిన ఆస్తుల సేకరణ

**రూ.2వేల కోట్లకు పైగా అయ్యే చోట కేవలం బడ్జెట్‌లో రూ. 700కోట్లు మాత్రమే కేటాయింపు**

సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఫ్లై ఓవర్లు.. ఆర్వోబీ.. ఆర్‌యూబీలు, రహదారులు, నాలాల విస్తరణ..లింకు రోడ్లు.. అభివృద్ధి ఏదైనా సకాలంలో ప్రాజెక్టు పూర్తి కావాలంటే భూసేకరణ అత్యంత కీలకం. ఆయా ప్రాజెక్టు వ్యయం ఎంత ఖర్చు అవుతుందో..భూసేకరణకు అంతే స్థాయిలో వ్యయం అవుతుంది. అయితే ఆస్తుల సేకరణలో జీహెచ్‌ఎంసీ లోపభూయిష్టంగా వ్యవహరిస్తున్నది. ఒక ప్రాజెక్టు పనులు ప్రారంభం సమయంలోనే దాదాపు ఆస్తుల స్వాధీనంలో పైచేయిగా ఉండాలి. కానీ ఘనత వహించిన జీహెచ్‌ఎంసీ భూసేకరణపై స్పష్టత లేకుండానే ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయడం అధికారుల పనితీరును నిదర్శనం. అంతేకాకుండా పురోగతిలో ఉన్న ప్రాజెక్టు పనుల్లో భాగంగా అన్నింటికీ భూసేకరణకు అయ్యే నిధుల విషయంలో స్పష్టత ఉండాలి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) వార్షిక బడ్జెట్‌లో హెచ్ సిటీ-1 కింద చేపట్టనున్న మొత్తం పనులకు సర్కారు రూ. 2654 కోట్లను ప్రకటించినా, ఇప్పటి వరకు కేవలం రూ.852 కోట్లకు మాత్రమే పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో స్థల సేకరణకు జీహెచ్‌ఎంసీ మొత్తం రూ.700కోట్లను కేటాయించింది. కానీ ఒక్క కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు ఫ్లై ఓవర్లు, ఏడు అండర్‌పాస్‌లను చేపట్టనున్న హెచ్ సిటీ ప్రాజెక్టు పనులకు రూ. 510 కోట్లు కేవలం స్థల సేకరణకు వెచ్చించనున్నారు. అంతేకాకుండా బంజారాహిల్స్ విరించి హాస్పిటల్ నుంచి కేబీఆర్ పార్కు వరకు రహదారి విస్తరణకు భూ సేకరణకు మరో రూ. 150కోట్ల ఖర్చు చేయనున్నారు. ఇక నగరంలో పలు చోట్ల హెచ్ సిటీ ప్రాజెక్టు కింద నాలాల అభివృద్ధి, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణాలు జరగనున్నాయి. కానీ వీటికి మాత్రం భూ సేకరణకు అయ్యే నిధులపై అధికారులకు స్పష్టత లేదు. దీంతో వచ్చే ఏడాదిలో హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై తీవ్ర ప్రభావం చూపనున్నది. భూ సేకరణకు నిధుల గండం పొంచి ఉండడంతో వచ్చే ఏడాది మొత్తంలోనూ హెచ్ సిటీ ప్రాజెక్టు పూర్తికి మోక్షం కలగడం కష్టమేనన్న అభిప్రాయాలు ఇంజినీర్లలో వ్యక్తమవుతున్నది.

**పాత నగరంలో సవాల్‌గా మారిన భూ సేకరణ**

గ్రేటర్ హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి పథకాలకై చేపట్టే భూ సేకరణ, ఆస్తుల సేకరణ సందర్భంగా జీహెచ్‌ఎంసీ టీడీఆర్ పత్రాలను అందజేస్తున్నారు. అభివృద్ధి పనులకు, ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూమిని సేకరించి, నగదు పరిహారానికి ప్రత్యామ్నాయంగా ఈ టీడీఆర్‌ను ఇస్తున్నారు. ఏదైన ఒక నిర్వాసితుడు నాలా విస్తరణ వల్ల ఏ మేరకు స్థలాన్ని కోల్పోయాడో, అంతకు నాలుగు రెట్లకు టీడీఆర్ పత్రాలను పరిహారంగా పొందుతాడు. ఉదాహరణకు అమీర్‌పేటలో 20 గజాల స్థలాన్ని కోల్పోయిన నిర్వాసితుడు జీహెచ్‌ఎంసీ ఇచ్చే 80 గజాల టీడీఆర్ పత్రాన్ని తీసుకుని ఇతరులకు విక్రయించుకునే హక్కు పొందుతాడు. టీడీఆర్ పత్రం కలిగిన వారు, జీహెచ్‌ఎంసీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి ఇచ్చే అనుమతికి అదనంగా చేపట్టే నిర్మాణ వైశాల్యాన్ని నిబంధనలను అనుసరించి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఫలితంగా లక్ష రూపాయలు ఇవ్వాల్సిన పరిస్థితుల్లో..టీడీఆర్ ద్వారా అంతకు రెట్టింపు లేదా, తనకు నచ్చిన మొత్తానికి విక్రయించుకొని లాభపడుతున్నారు. అయితే పాతనగరం మినహా ఇతర ప్రాంతాల్లో ఈ టీడీఆర్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంది. మార్కెట్లో టీడీఆర్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. కానీ పాతనగరంలో మాత్రం టీడీఆర్‌లకు వద్దంటున్నారు. దీనికి వారిలో అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యమేనని చెప్పవచ్చు. మొత్తంగా పాత నగరంలో వివిధ అభివృద్ధి పనులకుగానూ ఆస్తుల సేకరణ నత్తకు నడకలు నేర్పుతున్నది. ఎస్ఆర్‌డీపీలో భాగంగా జూ పార్కు-ఆరాంఘర్ ఫ్లై ఓవర్, సర్వీస్ రోడ్ల విస్తరణ, సైదాబాద్‌లో స్టీల్ బ్రిడ్జి పనుల్లో భాగంగా ఆస్తుల సేకరణే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నది. వీటితో పాటు నాలాల అభివృద్ధి, రహదారుల విస్తరణలో భూసేకరణ జాప్యమవుతున్నది. జీహెచ్‌ఎంసీ అధికారులు మాత్రం టీడీఆర్ వద్దంటున్నారంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్‌ఎంసీ నిధుల సమస్యతో కొట్టుమిట్టాడుతుండడంతో స్పెషల్ ఫండ్ కింద పాత నగరంలో భూ పరిహార బాధితులకు ప్రభుత్వం నుంచే నష్ట పరిహారం అందజేస్తూ వస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఆలస్యంగా వస్తుండడంతో ఆస్తుల సేకరణ సందిగ్ధంలో పడింది.



కేసారం-తొరుమామిడి రోడ్డుపై గుంతలను పూడ్చుతున్న కార్మికులు



మోకాలు లోతు గుంతలు ఉన్న రోడ్డు (ఫైల్)

# పై పై పూతలేనా!

- అధ్వానంగా కేసారం-తొరుమామిడి రోడ్డు
- మరమ్మతులతోనే సరిపెడుతున్న ప్రభుత్వం
- బీటీ రోడ్లను నిర్మిస్తామని కాంగ్రెస్ నేతల హామీ
- అధికారంలోకి రాగానే వాటి ఊసే లేదని విమర్శలు

బంట్వారం, డిసెంబర్ 30 : ఏండ్లుగా మోకాలు లోతు గుంతలు పడ్డాయి. కనీసం నడిచేందుకు కూడా వీలు లేని రోడ్లు అధ్వానంగా మారాయి. అలాంటి రోడ్లపై నేడు ప్రభుత్వం మరమ్మతులతోనే సరిపెడుతున్నది. గత ఏడాది నుంచి రోడ్ల నిర్మాణానికి నిధులు వచ్చాయి. వెంటనే బీటీ రోడ్లుగా మారుస్తామని కాంగ్రెస్ నేతలు హామీలు ఇచ్చారు. తీరా ఇప్పుడు కేసారం-తొరుమామిడి రోడ్డులో మరమ్మతులు చేస్తున్నారు. ఇదంతా చూస్తే కేవలం మరమ్మతులు చేసి, చేతులు దులుపుకుంటున్నారని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా మండల పరిధిలో తొరుమామిడి-కేసారం ఆర్‌అండ్‌బీ రోడ్డు, రొంపల్లి-బంట్వారం, యాచారం-బంట్వారం ఆర్‌అండ్‌బీ రోడ్లు మోకాలు లోతు గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు అవుతున్నాయి. ఈ రోడ్ల పరిస్థితిని చూసి బస్సులు సైతం రూటు మళ్లించగా, మరి కొన్ని బస్సులను అధికారులు రద్దు చేశారు. ఈ రోడ్ల మీద పలుమార్లు ప్రయాణికులు సైతం ప్రమాదాలకు గురయ్యారు. నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన జి ప్రసాద్‌కుమార్ నేడు స్పీకర్ స్థాయిలో ఉన్నారని, ఆయన అధిక నిధులు తెచ్చి రోడ్లన్నీ నిర్మించి, నియోజక వర్గాన్ని అందంగా ముస్తాబు చేస్తారని ఏడాది నుంచి పార్టీ నాయకులు గొప్పగా చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నిధులు తీసుకు రావడంలో విఫలమవుతున్నారని అయా గ్రామాల ప్రజలు, మాజీ ప్రజా ప్రతినిధులు తమలో తాము చర్చించుకుంటున్నారు. ఇతర నియోజక వర్గాలకు ఇచ్చినట్లు నిధులు వికారాబాద్ నియోజక వర్గానికి ఎందుకు ఇవ్వడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న మరమ్మతులను చూస్తే పెద్ద గుంతలను మాత్రం పూడ్చి, చిన్న, చితక వాటిని వదిలేస్తారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. దీంతో తిరిగి చిన్న గుంతలే పెద్దవిగా మారుతాయని ప్రజలు వాపోతున్నారు. మరమ్మతులు చేసిన రోడ్డు ఏడాదిలో మళ్లీ గుంతలు ఏర్పడుతాయని, బీటీ రోడ్ల నిర్మాణం చేపడితే మన్నికగా ఉంటాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో కాంగ్రెస్ నాయకుల ఘర్షణ


- పారదర్శకంగా నిర్వహించాలన్న బీఆర్ఎస్ నేతలు
- దాడికి పాల్పడిన అధికార పక్షం
- గాయపడిన వారిని దవాఖానకు తరలించిన గ్రామస్తులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై ఆనంద్‌కుమార్
- ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు

దోమ, డిసెంబర్ 30 : ఇందిర్మ ఇండ్ల సర్వేలో కాంగ్రెస్ నాయకులు ఘర్షణకు దిగిన ఘటన దోమ మండల పరిధిలోని గుండాల గ్రామ అనుబంధ తండాలోని గుండాల తండాలో జరిగిది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గుండాల తండాలో అధికారులు నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకోవడంతో ఘర్షణ తలెత్తింది. ఇరు వర్గాలకు చెందిన నాయకులు పంచాయతీ ఏర్పాటు చేసి ఇరు వర్గాల వారిని సముదాయించే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. ఈ ఘర్షణలో కొందరు తీవ్రంగా గాయపడగా, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనలో గాయపడ్డ వారిని స్థానికులు పరిగి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పలువురి పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ దవాఖానకు తరలించినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై ఆనంద్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గుడుంబాపై ఉక్కుపాదం

**వికారాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం**

**ప్రొహిబిషన్, ఎక్సైజ్ వికారాబాద్ జిల్లా సూపరింటెండెంట్ విజయభాస్కర్**



వికారాబాద్, డిసెంబర్ 30 : వికారాబాద్‌ను గుడుంబా రహిత జిల్లాగా ఉంచేందుకు ల క్ష్యంగా పెట్టుకొని ఎక్సైజ్ శాఖ నిరంతరం కృషి చేస్తున్నదని ప్రొహిబిషన్, ఎక్సైజ్ వికారాబాద్ జిల్లా సూపరింటెండెంట్ విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ మద్యం సంబంధిత నేరాలపై నిఘా ఉంచుతున్నామని తెలిపారు. ఆయా నేరాల్లో పాల్గొన్న వ్యక్తులపై కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తం గా 2024లో 888 కేసులను నమోదు చేసి.. 350 మందిని అరెస్టు చేశామన్నారు. జిల్లాలో గుడుంబా తయారీ, సరఫరా తదితర ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వీటిపై ఈ ఏడాది 354 కేసులు నమోదు చేసి 184 మందిని అరెస్టు చేయడంతో పాటు 10 వాహనాలను సీజ్ చేశామన్నారు. లైసెన్స్ లేకుండా కల్లు అమ్ముతున్న వ్యక్తులను గుర్తించి 142 కేసులు నమోదు చేసి 36 మందిని అరెస్టు చేశామన్నారు. బెల్ట్ షాప్‌లకు సంబంధించి 119 కేసులు నమోదు చేసి 86 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. డ్రగ్స్, గం జాయికి సంబంధించి 21 ఎన్‌డీపీఎస్ కేసు లు నమోదు చేసి 26 మందిని అరెస్టు చేశామని తెలిపారు. 165 కేజీల గంజాయిని పట్టుకోవడంతో పాటు రెండు వాహనాలను స్వాధీ నం చేసుకున్నామని పేర్కొన్నారు. ఇతర రా ష్ట్రాల నుంచి వస్తున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ మన రాష్ట్ర ఖజానాకు నష్టం కలిగిస్తున్నదని తెలిపారు. ఇందు లో భాగంగా 20 ఎన్‌డీపీఎల్ కేసు లు నమోదు చేసి ఐ దు గురిని అరెస్టు చేశామన్నారు. 474 లీ టర్ల ఎన్‌డీపీఎల్ లిక్కర్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా ఈ ఏడాది 258 ఈవెంట్స్ నిర్వహణకు అనుమతి కోసం పలువురు వ్యక్తులు, రిసార్టులు అడిగారని తెలిపారు. జిల్లాలో గతేడాది రూ.668 కోట్లుగా ఉన్న మద్యం విక్రయాలు, ఈ ఏడాది రూ.728 కోట్లుగా నమోదు అయిందని పేర్కొన్నారు.